సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 18 । అక్టోబర్ । 2025



చెడ్డీగ్యాంగ్ హల్‌చల్!
చౌటుప్పల్‌లో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసింది. గురువారం అర్ధరాత్రి అంజనసాయి మెడోస్ వెంచర్‌లోకి చొరబడింది. - IIలో



రాష్ట్రమంతా ఒకేలా నిర్మించాలి
రీజినల్ రింగ్ రోడ్డును రాష్ట్రమంతటా ఒకేలా నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు డిమాండ్ చేశారు. - IIలో



కొనుగోలు కేంద్రాల్లోనే 'మద్దతు'
కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - IIIలో

న్యూస్‌రీల్

క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ సత్యనారాయణ

బొమ్మలరామారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈఓ సత్యనారయణ అన్నారు.బొమ్మలరామారం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన 69వ జిల్లా స్థాయి అండర్–14 బాలల వాలీబాల్ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పేరు తేవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేసిన ఎస్‌ఐ బుగ్గ శ్రీశైలంను సన్మానించారు.ఈ పోటీల్లో బాలికల విభాగంలో బొమ్మలరామారం జెడ్పీ హైస్కూల్, బాలుర విభాగంలో చౌటుప్పల్ స్కూల్ ప్రథమ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు డీఈఓ బహుమతులు అందజేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి సౌజన్యంతో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా కార్యదర్శి దశరథ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. మధుసూదన్, మండల క్రీడా కార్యదర్శి నర్సింహ, పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్‌నర్సింహ, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, రాంపల్లి మహేష్‌గౌడ్, బోనంకూర మల్లేష్, జూపల్లి భరత్, కట్టా శ్రీకాంత్ గౌడ్, వంశీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జిగా రవీందర్

ఆలేరు: ఆలేరు పట్టణానికి చెందిన బజ్జూర్ రవీందర్ ఆర్యవైశ్య కార్పొరేషన్ యాదాద్రి జిల్లా ఇంచార్జిగా నియామకమయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయనను పలువురు ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు సముద్రాల కుమార్, శ్రీనివాస్‌తో పాటు పలువురు సంఘం నాయకులు సన్మానించి అభినందలు తెలిపారు.

రాజ్యాంగ హక్కులు ప్రజలందరికీ అందాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మాధవిలత

బొమ్మలరామారం: ప్రజలందరికీ రాజ్యాంగ హక్కులు అందాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి మాధవిలత పేర్కొన్నారు. బొమ్మరామారం మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయ సహాయం, సలహాలు, ప్రభుత్వ కార్యాలయాల ద్వారా సేవలు అందించేందుకు టోల్ ఫ్రీనంబర్ 15100 ఉన్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక బాలబాలికల ఆశ్రమాలు, మల్యాల కేజీబీవీ, రాంపూర్‌లోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో న్యాయ సహాయ న్యాయవాది నాగరాజు, ఎంపీడీఓ త్రివిక్రమ్, ఎంపీఓ శ్రీమాళిని, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, ఏపీఓ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు వెళ్లేదెట్లా!

ఆగకుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు
- సిటీ సర్వీసులను విస్తరించడంలో జాప్యం
- నానాటికీ పెరుగుతున్న ఓపీ
- రవాణాపరంగా ఇబ్బందులు
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లిన బండారు దత్తాత్రేయ



ఎయిమ్స్ ఎదుట బస్టాప్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న రోగులు, వారి సహాయకులు

సాక్షి, యాదాద్రి : అత్యాధునిక హంగులు, అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న బీబీనగర్ ఎయిమ్స్‌కు సరైన రవాణా సౌకర్యం సమకూరడం లేదు. ఇక్కడికి చేరుకోవాలంటే రోగులు, వారి సహాయకులు అవస్థలు తప్పడం లేదు. జాతీయ రహదారి గుండా ఎయిమ్స్ ముందు నుంచే ఆర్టీసీకి చెందిన వందలాది బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ, 70 శాతం బస్సులు ఆపకుండానే వెళ్తున్నాయి. సిటీ సర్వీసులను ఎయిమ్స్ వరకు విస్తరించడంలోనూ జాప్యం చోటు చేసుకుంటుంది. దీంతో రోగులు ప్రైవేట్ వాహనాల్లో ఆస్పత్రికి చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల ఎయిమ్స్ సందర్శనకు వచ్చిన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు రోగులు రవాణా పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై గోడు వెల్లబుచ్చారు. ఈ మేరకు దత్తాత్రేయ లేఖ ద్వారా సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో పాటుగా పలు అంశాలను లేఖలో ప్రస్తావించి రాష్ట్ర ప్రభుత్వం తనవంతు సహకారం అందజేయాలని కోరారు.

గుట్ట బస్సులు మాత్రమే స్టాప్

హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారి పక్కనే బీబీనగర్ ఉంది. వందలాది బస్సులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ, కేవలం యాదగిరిగుట్ట బస్సులు మాత్రమే అపుతున్నారు. వరంగల్, జనగామ, ఆలేరు ప్రాంతాల నుంచి, హైదరాబాద్ జంటనగరాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎయిమ్స్ బస్టాప్‌లో బస్సులు ఆగక ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా భువనగిరి, చౌటుప్పల్, గజ్వేల్ ప్రాంతాలతో పాటు ఉప్పల్, ఘట్కేసర్ నుంచి సిటీ సర్వీస్‌లను ఎయిమ్స్ వరకు విస్తరించాల్సి ఉంది.

ఎంఎంటీఎస్ వస్తే ఎంతో ఉపయోగం

వైద్యం కోసం రోజూ వందలాది మంది రోగులు హైదరాబాద్, వరంగల్ వైపునుంచి ఎయిమ్స్‌కు వస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి ఎక్కువగా వస్తుంటారు. ఎంఎంటీఎస్ పూర్తయితే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ, ఘట్కేసర్ నుంచి వంగపల్లి వరకు పొడిగించిన ఎంఎంటీఎస్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. అందుబాటులోకి వస్తే బీబీనగర్ ఎయిమ్స్ వద్ద అప్ అండ్ డౌన్‌లో స్టాప్ ఇవ్వాల్సి ఉంది. ఎంఎంటీఎస్ అందుబాటులోకి వచ్చే వరకు సబర్బన్ రైళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్ డిపో ఏర్పాటు అవసరం

ఎయిమ్స్‌కు పెరుగుతున్న రోగుల తాకిడికి అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి. ఇక్కడ బస్ డిపో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతోంది. తద్వారా ఇక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది. రోజువారీ రవాణా కార్యకలాపాల కోసం బీబీనగర్‌లో బస్ డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సహకారం అందించాలి

ప్రధాని నరేంద్రమోదీ ఎంతో ముందు చూపుతో బీబీనగర్ వద్ద ఎయిమ్స్ ఏర్పాటు చేశారు. పెరుగుతున్న రోగులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తనవంతు సహకారం అందించాలి. రోడ్డుకు ఇరువైపులా బస్‌బేలు ఏర్పాటు చేయాలి. ప్రతి బస్సు ఆగే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎలక్ట్రిక్ బస్సులు నడపాలి. ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి. వీటితో ఆటు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.
–బండారు దత్తాత్రేయ, హర్యానా మాజీ గవర్నర్

రోజూ రెండు వేల వరకు ఓపీ

బీబీనగర్ ఎయిమ్స్‌కు ఓపీ పెరుగుతోంది. రోజూ సుమారు 2వేల వరకు ఓపీ వస్తుంది. ఈ క్రమంలో ఆస్పత్రి వద్ద ప్రతి బస్సు ఆపాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు. ఇక హైదరాబాద్‌లోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రులైన అఫ్జల్‌గంజ్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్, సికింద్రాబాద్‌లోని గాంధీ జనరల్ అస్పత్రి, యాదగిరిగుట్ట దేవస్థానం, ఎయిమ్స్ బీబీనగర్‌ల మధ్య ఎలక్ట్రిక్ బస్సులు (ఇ–బస్సులు) పెంచాల్సిన అవసరం ఉంది.



ఎయిమ్స్‌లోని ఓపీ కౌంటర్ల వద్ద బారులుదీరిన రోగులు



కలెక్టరేట్ ఎదుట భూ నిర్వాసితుల దీక్షలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

అలైన్‌మెంట్ మార్పిస్తారా.. రిజైన్ చేస్తారా

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చెరుపల్లి సీతారాములు డిమాండ్
- రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల దీక్ష, వంటావార్పు

భువనగిరిటౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మారుస్తారా.. లేక పదవులకు రాజీనామా చేస్తారా.. అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలంటూ శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భూ నిర్వాసితులతో కలిసి నిరాహార దీక్ష, వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ.. గెలిపిస్తే అలైన్‌మెంట్ మార్పిస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు.. ప్రభుత్వాన్ని ఎందుకు ఒప్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్ మార్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రింగ్ రోడ్డు అశాస్త్రీయంగా ఉందని, రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ మాట్లాడుతూ వందలాది మంది రైతులు తమకు జీవనాధారమైన భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలైన్‌మెంట్ మార్చడంతో పాటు నిర్వాసితులకు భూమికి భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బహిరంగ మార్కెట్ ధరపై అదనంగా మూడింతల పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వీరారెడ్డి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, భూ నిర్వాసితుల నాయకుడు అవిశెట్టి పాండు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బోలగాని జయరాములు, గంగదేవి సైదులు, గడ్డం వెంకటేష్‌తదితరులు పాల్గొన్నారు.



వంటావార్పు చేస్తున్న జహంగీర్, నాయకులు

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, లేనిపక్షంలో 200 మంది భూ నిర్వాసితులం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని రైతులు రాములుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గంటె పాక శివ, లలిత తదితరులు హెచ్చరించారు. దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని, అలైన్‌మెంట్ మారుస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. 21వ తేదీ లోగా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని తమ బంధువులతో కలిసి నామినేషన్లు వేస్తామని చెప్పారు.



నిరహార దీక్షలో మాట్లాడుతున్న భూ నిర్వాసితుడు రాములు గౌడ్

అందరి ఆమోదంతోనే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక



అభిప్రాయ సేకరణలో ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్, ఎమ్మెల్యేలు ఐలయ్య, కుంభం



అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్
- కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరణ

భువనగిరిటౌన్ : అందరి ఆమోదంతోనే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని నియమిస్తామని ఏఐసీసీ పరిశీలకుడు శరత్‌రౌత్ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం భువనగిరిలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తుల్లో ఆరుగురి పేర్లను అధిష్టానికి పంపుతామని, ఇందులో ఒక మహిళ కూడా ఉంటుందన్నారు. అధిష్టానం వారి బయోడేటా పరిశీలించి డీసీసీ అధ్యక్షుడి పేరు ఖరారు చేస్తుందన్నారు. శనివారం(నేడు) ఆలేరు నియోజకవర్గంలో, 19న భువనగిరి నియోజకవర్గంలో బ్లాక్‌ల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు శరత్‌రౌత్ వెల్లడించారు. గతంలో నాయకులు తమకు అనుకూలమైన వ్యక్తులను నియమించేవారని, ఈసారి అలాంటి పరిస్థితి ఉండదని, పారదర్శకంగా ఎంపిక ఉంటుందన్నారు. గుజరాత్ వేదికగా మొదలైన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందన్నారు.

రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ మద్దతు : బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీసీ సంఘాలు శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్‌ఎస్ మౌనంగా ఉంటుందని ఆరోపించారు. రిజర్వేషన్ల విషయం తమ పార్టీ చేతుల్లోనే ఉన్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో బీజేపీ నాయకులు ఉన్నారని విమర్శించారు. బంద్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు పలువురి పేర్లను ప్రతిపాదన చేసి పరిశీలకుడికి వివరించారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నాయకులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

భువనగిరిటౌన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా జిల్లా బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌కు మద్దతివ్వాలని కోరుతూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా బీసీ సంఘాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. వ్యాపార, వాణిజ్య, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరాయి. బంద్‌కు ఎస్సీ, ఎస్టీ సంఘాలు కూడా మద్దతు పలికాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ హనుమంతరావు



వెల్లంకి గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

రామన్నపేట : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శుక్రవారం రాత్రి రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు, వివిధశాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి పల్లెనిద్ర కార్యక్రమంను చేపట్టినట్లు వివరించారు. శాఖలవారీగా పనితీరును సమీక్షించారు. వెల్లంకి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందని, గ్రామ పంచాయతీ, రైతు వేదిక తదితర భవనాలు అద్భుతంగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరును కొనియాడి, ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఏ ఒక్క పిల్లవాడిని ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా తీర్మానంచేసి అమలు చేయాలని సూచించారు. లక్ష్మీనగర్‌లో కనీస వసతులు కల్పించాలని, గుండ్రాంపల్లి రోడ్డు మరమ్మత్తులు చేయాలని, ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కాగా గ్రామంలో కలెక్టర్ పల్లెనిద్ర చేయాల్సి ఉండగా అనివార్య కారణాలతో వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ క్రిష్ణవేణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఎంహెచ్‌ఓ మనోహర్, జిల్లా వ్యవసాయాధికారి రమణారెడ్డి, హౌసింగ్ పీడీ విజయ్‌సింగ్, జిల్లా సివిల్‌సప్లై అధికారి రోజారాణి, డీపీఓ విష్ణువర్ధన్ తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి, ఎంపీడీఓ రాములు, రవూఫ్‌అలీ, గాలయ్య, వెంకటరమణ, కోటేశ్వర్ రావు, శోభ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు రాస్తే కేసులా..?

ఏపీ కూటమి సర్కార్ తీరు ఆక్షేపణీయం
- 'సాక్షి' ఎడిటర్, విలేకరులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- కలెక్టరేట్ ఎదుట రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాల నిరసన




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

భువనగిరిటౌన్ : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, మరో ఆరుగురు పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడాన్ని జర్నలిస్టు సంఘాలు, సీపీఎం, సీపీఐ, బీఆర్‌ఎస్, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. తక్షణమే కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్‌మోహన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వార్త రాయడం విలేకరి ప్రాథమిక ధర్మమని, వార్తలో పేర్కొన్న విషయాల్లో నిజానిజాలను నిర్ధారణ చేసుకుని నిందితులపై చర్యలు తీసుకోవడం మాని, పాత్రికేయులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ కూటమి సర్కార్ రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని తాము భావిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడం వల్ల పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందని, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం లేదన్న సందేశం సమాజంలోకి వెళ్తుందన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, తప్పుడు కేసులను భేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ యంబ నర్సింహులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ కన్వీనర్ కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎనబోయిన అంజనేయులు, పెంట నర్సింహ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏశాల అశోక్, చేతి వృత్తులు, పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు బొలగాని జయరాములు గౌడ్, ఎంబీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జంపాల నాగచందర్, వివిధ పార్టీలు, జర్నలిస్టు సంఘాల నాయకులు కొండమడుగు నర్సింహ, మెరుగు చెన్నయ్య, రాయిగిరి మల్లేశం, గడ్డమీది చంద్రం, నరేష్, బి.నరేందర్, మాటూరి బాలరాజు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బట్టుపల్లి అనురాధ, ఏవీ కిరణ్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, సుర్పంగ స్వామి, దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేశం, వనం రాజు, తండ జహంగీర్, ఇండ్ల మచ్చేందర్, పుట్ట హనుమంతు, దంగు నరేందర్, బుక్కాల నరేష్, ఆరుట్ల కిషోర్ కుమార్, బద్ద అమరేనాథ్, మహ్మద్ సుజావుద్దీన్, బలరాం, ఐతరాజు రాములు, గాలయ్య, గాజుల అంజయ్య, నెలికంటి రాములు, పడమటి దామోదర్‌రెడ్డి, గన్నెబోయిన నరసింహ, సత్యనారాయణ , విద్యార్థి సంఘాల నాయకులు వంగాల మల్లేష్‌గౌడ్, ఎగ్గిడి కృష్ణ, సాక్షి రిపోర్టర్లు మాటూరి వెంకటేశ్వర్లు, క్లెం సంపత్, అలీ షరీఫ్, భూపాల్, జహంగీర్, మల్లారెడ్డి, రమేష్, బాలకిషన్, చంద్రశేఖర్‌గౌడ్, జానకిరాం, బాలకృష్ణ, ఉపేందర్, శ్రీధర్, జమాలొద్దీన్, రవికుమార్, పాండురంగం, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నాయకులు



హక్కులకు భంగం




ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి సర్కారు తీరు ప్రజాస్వామ్య హక్కులకు భంగాకలిగించేదిగా ఉంది. వాస్తవాలు రాస్తూ ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకవస్తున్న సాక్షి దినపత్రిక ఎడిటర్, పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టడం, వారి ఇళ్లకు పోలీసులను పంపించి భయభ్రాంతులకు గురి చేయడం హేయమైన చర్య. కేసులను ఉపసంహరించుకోకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదు.
– కొలుపుల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు

పత్రికా స్వేచ్ఛకు ముప్పు




వాస్తవాలు రాస్తున్నారన్న దురుద్దేశంతో సాక్షి ఎడిటర్, విలేకర్లను భయభ్రాంతులకు గురి చేసే ఆలోచన తప్పు. సాక్షి కార్యాలయాలపైకి పోలీసులను పంపడం తగదు. ఏపీ ప్రభుత్వ తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. పత్రికా స్వేచ్ఛకు ముప్పు వాటిల్లేవిధంగా ఉంది. దీని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇటువంటి విధానాలను కూటమి సర్కార్ మానుకోవాలి.
– ఎండీ జహంగీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రజాస్వామ్యంపై దాడి




ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న 'సాక్షి' మీడియాపై ఏపీ కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరు హేయం. కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం విషయంలో ప్రజల ఎదుట దోషిగా నిలబడింది. వాస్తవాలను ఎత్తి చూపుతున్న 'సాక్షి'పై అక్రమ కేసులు పెట్టి అడ్డుకోవాలని చూస్తోంది. సాక్షి కార్యాలయాలకు పోలీసులు వెళ్లడం ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలి.
– ఏశాల అశోక్, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

రాజకీయ కక్ష సాధింపే..



ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారని సాక్షి పత్రిక కార్యాలయాల్లో పోలీసులు సోదాలు చేయడం, ఎడిటర్, విలేకరులను బెదిరించడం కూటమి సర్కార్‌కు తగదు. ఇది రాజకీయ కక్షగా భావిస్తున్నాం. ఇటువంటి చర్యలకు స్వస్తి పలకకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఏదైనా ఉంటే ప్రజాస్వామ్య మార్గంలో ఎదుర్కొవాలి.
– మెరుగు చెన్నయ్య, సీనియర్ జర్నలిస్టు, భువనగిరి

దుర్మార్గమైన చర్య



దేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో మనువాదుల ప్రభుత్వాలు ఉన్నాయి. సామాన్య ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తున్న వ్యక్తులు, పత్రికలపై దాడులకు పాల్పడుతున్నాయి. దుర్మార్గమైన పాలన కొనసాగిస్తుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. పత్రికలు, పాత్రికేయులపై దాడులు, అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. భేషరతుగా కేసులు ఎత్తివేయాలి.
– బట్టుపల్లి అనురాధ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు

నేడు నాగార్జునసాగర్‌కు ఏపీ గవర్నర్

- ఏర్పాట్లను పరిశీలించిన నల్లగొండ కలెక్టర్

నాగార్జునసాగర్ : ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నాగార్జునసాగర్‌కు రానున్నారు. రెండు రోజుల పాటు ఆయన కుటుంబసభ్యులతో కలిసి సాగర్‌లో పర్యటిస్తారు. ఉదయం 11.50 గంటలకు హెలికాప్టర్ ద్వారా ఏపీ గవర్నర్ సాగర్‌కు చేరుకుంటారు. రెండు రోజుల పాటు ఆయన సాగర్‌లోనే ఉండి వివిధ ప్రదేశాలను సందర్శించనున్నారు. ఏపీ గవర్నర్ పర్యటకు సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. అనంతరం విజయవిహార్‌లో అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం బీసీగురుకుల విద్యాలయంలో ఉన్న హెలీప్యాడ్, లాంచిస్టేషన్‌ను ఆమె సందర్శించారు. కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐ శ్రీనునాయక్, జిల్లా టూరిజం అధికారి శివాజీ, పెద్దవూర తహసీల్దార్ శాంతిలాల్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యవిధానపరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మాతృనాయక్, డాక్టర్ రవి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్లికార్జున్‌రావు, మున్సిపల్ కమిషనర్ వేణు, అధికారులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఆశలు నింపిన డిండి

- రెండు నెలలుగా అలుగు పోస్తున్న డిండి ప్రాజెక్టు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, మత్స్యకారులు

డిండి: ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దుందుబి వాగు దిగువకు పరవళ్లు తొక్కుతుండడంతో మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి అలుగు పోస్తోంది. వానాకాలం సీజన్‌కుగాను ఆయకట్టులోని ఎడమ కాలువ ద్వారా 12,500 ఎకరాలు, కుడి కాలువ ద్వారా 250 ఎకరాల సాగుకు నీటిని విడుదల చేశారు. గత రెండు నెలలుగా డిండి ప్రాజెక్టు నిండుకుండలా మారి అలుగు పోస్తుండడంతో వానాకాలంతోపాటు యాసంగి సీజన్‌లో కూడా పంటలకు నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చేపల వేటనే నమ్ముకున్న 600 మత్స్యకార కుటుంబాలకు డిండి ప్రాజెక్టు జీవనాధారంగా మారింది. రెండు సంవత్సరాల వరకు చేతినిండా పని దొరకుతుందని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన బాధ తప్పిందని వారు పేర్కొంటున్నారు.


అలుగు పోస్తున్న డిండి ప్రాజెక్టు

క్లుప్తంగా

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు అపహరణ

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని చౌటబావి గ్రామంలో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో గుర్తుతెలియని వ్యక్తి మూడు తులాల బంగారు పుస్తెలతాడు చోరీ చేశాడు. గ్రామానికి చెందిన సోమ లక్ష్మీనర్సింహారెడ్డి–బుచ్చమ్మ గురువారం రాత్రి ఇంటిలో నిద్రిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ఇంటిలోకి వచ్చి వృద్ధురాలి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలో బీచ్‌మహల్లాలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. బీచ్‌మహల్లాలో నివాసం ఉంటున్న హలీంపాషా నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం తిరిగి ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువా తలుపులు తెరచి ఉండగా అందులో ఉన్న రెండున్నర గ్రాముల బంగారం చెవిరింగులు, వెండి వస్తువులు, రూ.15 వేలు కనిపించలేదు. తన ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్ మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లిన లారీ



నాగారం : లారీ అదుపుతప్పి బైక్ మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన శుక్రవారం నాగారం ఎక్స్‌రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. తిరుమలగిరి వైపు నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న లారీ నాగారం ఎక్స్‌రోడ్డు వరకు రాగానే ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి బైక్ మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో షెడ్డు ఆవరణలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. షెడ్డు బయట ఉన్న ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. సమీపంలో ఉన్న మరో షాపునకు చెందిన ప్రహరీ కొంతమేర ధ్వంసమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకుబ్ తెలిపారు.

చౌటుప్పల్‌లో చెడ్డీగ్యాంగ్!

- రాత్రివేళ తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ
- చౌటుప్పల్‌లోని అంజనసాయి మెడోస్ వెంచర్‌లో ఘటన

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసింది. గురువారం అర్ధరాత్రి దాటాక పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో గల అంజనసాయి మెడోస్ వెంచర్‌లోకి చొరబడ్డారు. తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. చేతిలో మారణాయుధాలతో ముగ్గురు దొంగలు సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్నకొండూర్ గ్రామానికి చెందిన డొప్ప నరేష్ సెంట్రింగ్ పని చేస్తుంటాడు. అంజనసాయి మెడోస్ వెంచర్‌లోని కృష్ణవేణి హైస్కూల్ వెనుక వైపున ఉన్న చీకూరి శ్రీనివాస్ ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలోని బంధువుల నివాసంలో జరిగిన ఫంక్షన్ కోసం ఈనెల 16న కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. శుక్రవారం తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించాడు. ఆందోళనకు గురై వెంటనే బీరువా తెరిచి చూడగా.. 8గ్రాముల బంగారం, 8.5తులాల వెండితోపాటుగా నగదు కన్పించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. వారు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. పరిసరాల్లోని సీసీ కెమెరాలు పరిశీలించారు.


ముగ్గురు దొంగలు కాలనీలో సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

చెడ్డీగ్యాంగ్ పనేనని అనుమానం

ముగ్గురు సభ్యులు గల బృందం ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ ముగ్గురు దొంగలు ముసుగులు ధరించారు. అందులో ఒక వ్యక్తి డ్రాయర్ మాత్రమే ధరించి, ఒంటికి నూనె రాసుకుని ఉన్నాడు. మరో ఇద్దరు వ్యక్తులు చేతుల్లో మారణాయుధాలు పట్టుకున్నారు. అయితే దొంగతనానికి పాల్పడింది చెడ్డీ గ్యాంగ్ సభ్యులేనా లేక స్థానికంగా ఉండే దొంగలే ముసుగులు ధరించి హల్‌చల్ చేశారా అని తెలియాల్సి ఉంది. బాధితుడు డొప్ప నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

దంపతులపై యువకుడి దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

నార్కట్‌పల్లి : మండలంలోని గోపలాయపల్లి గ్రామానికి చెందిన దంపతులపై అదే గ్రామానికి చెందిన యువకుడు గురువారం రాత్రి దాడికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపలాయపల్లి గ్రామానికి చెందిన దేశగాని వెంకన్న, వసంత దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన దేశగాని సులోచన, వసంతల మధ్య తరచూ గొడవలయ్యేవి. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం వసంత తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే వసంత మృతితో ఆమె పెద్ద కుమారుడు ఛత్రపతి శివాజీ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. తన తల్లి మృతికి దేశగాని సులోచనే కారణమని భావించి ఆమెపై కోపం పెంచుకున్నాడు. వసంత తండ్రి గురువారం మృతి చెందడంతో ఆయన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులందరూ రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి వెళ్లారు. అంత్యక్రియల అనంతరం రాత్రి ఛత్రపతి శివాజీ కక్కిరేణి నుంచి గోపలాయపల్లికి వచ్చాడు. తన తల్లి చావుకు కారణమైన సులోచనను హత్యచేయాలని నిర్ణయించుకున్నాడు. అర్ధరాత్రి అందరూ పడుకున్నాక సులోచన ఇంటికి వెళ్లాడు. ఇంట్లో పడుకున్న ఆమెపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. అడ్డు వచ్చిన ఆమె భర్త నర్సింహాపై కూడా దాడికి పాల్పడ్డాడు. దాంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. భార్యాభర్తల అరుపులతో చుట్టుపక్కల వారు లేచి రావడంతో ఛత్రపతి శివాజీ పారిపోయాడు. స్థానికులు తీవ్రంగా గాయపడిన సులోచన, నర్సింహ దంపతులను నల్లగొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించాలని బాలికపై యువకుడి దాడి

కేతేపల్లి: తనను ప్రేమించాలని ఇంట్లో ఒంటరిగా ఉన్న మైనర్ బాలికపై ఓ యువకుడు దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన కేతేపల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలానికి చెందిన కొరివి మధు అనే యువకుడు గ్రామంలోని బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన యువకుడు లోపలికి ప్రవేశించాడు. తనను ప్రేమించాలని బాలికను బెదిరించాడు. అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో చంపుతానని బెదిరించి, కత్తితో బాలికపై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని కోర్టులో రిమాండ్ చేసినట్లు కేతేపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

రాజాపేట : మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన క్లెం రామస్వామి (63) శుక్రవారం తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. రామస్వామి కల్లుగీత కార్మికుడు. సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దాంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడ మృతి చెందాడు. సీపీఐ జిల్లా నాయకుడు క్లెం కృష్ణ రామస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరిటౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. భువనగిరికి చెందిన యాకుబ్ (38) భువనగిరి పట్టణంలో చికెన్ సెంటర్ నడుపుతున్నాడు. మూడు రోజుల క్రితం యాకుబ్ తన దుకాణానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో కారు ఢీ కొట్టడంతో ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. అతడికి భార్య, సంవత్సరంన్నర కుమార్తె ఉంది.


యాకుబ్ (ఫైల్)

గొర్రెల దొంగలు అరెస్టు

యాదగిరిగుట్ట రూరల్ : గొర్రెల దొంగతనానికి పాల్పడిన యువకులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని ప్రెసిడెన్షియల్ సూట్ సమీపంలో తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామానికి చెందిన తౌఫిక్ ఉమర్, నీలం కరుణాకర్, సీస అరవింద్, ముదుగుల శ్రీను మహీంద్రా వాహనంలో వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. వీరు గత నెల చివరి వారంలో యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామంలో 14 గొర్రెలను ఎత్తుకెళ్లినట్లు విచారణలో తెలిపారు. పోలీసులు వారి నుంచి మహీంద్ర మరాజో వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భాస్కర్ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐ కృష్ణస్వామి, సిబ్బందిని ఆయన అభినందించారు.

రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్రమంతా ఒకేలా నిర్మించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డును రాష్ట్రమంతటా ఒకేలా నిర్మించాలని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో వారిని కలిసి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రైతుల న్యాయమైన పోరాటానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కొన్ని పరిశ్రమలకు ప్రయోజనం కల్పించడం, కొంత మంది బడా వ్యక్తులకు మేలు చేకూరేలా అలైన్‌మెంట్‌ను మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా కాకుండా ఆర్ఆర్ఆర్‌ను శాస్త్రీయంగా నిర్మించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూములను తక్కువ ధరకు లాక్కోవాలని చూడడం భావ్యం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నిర్వాసితులు నడికుడి అంజయ్య, గుజ్జుల సురేందర్‌రెడ్డి, పల్లె శేఖర్‌రెడ్డి, జాల వెంకటేశ్, జాల శ్రీశైలం, సందగళ్ల మల్లేష్, నాగవల్లి దశరథ, నెల్లికంటి నాగార్జున, భరత్, శ్రీనివాస్, బద్రుద్దీన్, నవీన్ తదితరులున్నారు.


పల్లా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

అధిక వడ్డీ కేసులో మరో నలుగురి అరెస్టు

- రూ.6.77కోట్ల విలువైన ఆస్తిపత్రాలు, నాలుగు కార్లు, నాలుగు ఫోన్లు స్వాధీనం
- కొనసాగుతున్న విచారణ
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ మౌనిక

పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి : అధిక వడ్డీ ఆశ చూపి అమాయక గిరిజనులను మోసం చేసిన బాలాజీనాయక్ కేసులో మరో నలుగురు ఏజెంట్లను శుక్రవారం గుడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మౌనిక కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగుతండాకు చెందిన రమావత్ వినోద్, రమావత్ సురేష్, రమావత్ రమేష్, రమావత్ చిరంజీవి అధిక వడ్డీ వ్యాపారంలో బాలాజీనాయక్‌కు ప్రధాన ఏజెంట్లుగా వ్యవహరిస్తూ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వీరిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు ఈ నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ6 కోట్ల 77 లక్షల విలువైన ఆస్తి పత్రాలు, నాలుగు కార్లు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేస్తున్నట్లు ఏఎస్పీ మౌనిక తెలిపారు. ఇప్పటికే బాలాజీనాయక్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి కేసు విచారణను వేగవంతం చేశామని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 310 మంది బాధితులు గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారని తెలిపారు. సమావేశంలో సీఐ నవీన్ కుమార్, కొండమల్లేపల్లి, గుర్రంపోడు, పీఏపల్లి ఎస్ఐలు అజ్మీరా రమేష్, మధు, నరసింహులు, నల్లగొండ స్పెషల్ టీం ఎస్ఐ సంపత్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

జైలు నుంచే బెయిలుకు యత్నం

- సోషల్ మీడియాలో బాలాజీనాయక్ వాయిస్‌కాల్ వైరల్

నల్లగొండ : అధిక వడ్డీ ఆశ చూపి గిరిజనుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి వారిని మోసం చేసిన కేసులో పోలీసులు అరెస్ట్ చేసిన బాలాజీనాయక్ వాయిస్ కాల్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నల్లగొండ జైలులో ఉన్న బాలాజీనాయక్ తమ బంధువులతో మాట్లాడారు. తన బెయిల్‌కు లక్ష రూపాయలు కావాలని చెబుతూనే, తనకు ఎలాగైనా బెయిల్ వచ్చేలా ప్రయత్నాలు చేయాలని సదరు వ్యక్తితో వారి భాషలో మాట్లాడాడు. ఈ వాయిస్ కాల్ రికార్డు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ విషయమై జైలర్ బాలకిషన్‌ను వివరణ కోరగా జైలులో ఉన్న నిందితులు వారానికి రెండుసార్లు తమ కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు పెయిడ్ ఫోన్ కాల్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు. అందులో భాగంగానే బాలాజీనాయక్‌కు అవకాశం కల్పించినట్లు చెప్పారు. అతను తన బెయిల్ గురించి మాట్లాడిన మాటలు అవతలి వ్యక్తి రికార్డు చేసి ఉంటాడని తెలిపారు. జైలు నిబంధనల మేరకు అతడికి ఫోన్ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు : తేది18-10-2025	యాదాద్రి భువనగిరి జోన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్	115
డ్రస్స్‌డ్ స్కిన్‌తో	213
రిటైల్ లైవ్ బర్డ్	142
స్కిన్ లెస్	240

బాలికను వేధించిన యువకుడికి మూడేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): ప్రేమ పేరుతో బాలికను వేధించిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి ఎన్. రోజారమణి శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కనగల్ మండలం కురంపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌కృష్ణ 2018లో నల్లగొండలో హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో వేధించాడు. బాలిక ఇంటర్ పూర్తి చేసి స్వగ్రామానికి వెళ్లగా.. గ్రామంలో ఆమెతో అసభ్యకరంగా వ్యవహరించాడు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రేమ్‌కృష్ణను అరెస్టు చేశారు. విచారణ అనంతరం చార్జ్‌షీట్ నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.7వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కోర్టుకు సరైన సాక్ష్యాధారాలు సమర్పించడంలో కోర్టు లైజన్ ఆఫీసర్ నరేందర్, మల్లిఖార్జున్, కానిస్టేబుల్ వెంకన్న సహకరించారు.

ఆటో డ్రైవర్‌కు ఆరు నెలలు..

చివ్వెంల(సూర్యాపేట) : వ్యక్తి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నగూరి అపూర్వ రవళి శుక్రవారం తీర్పు వెల్లడించారు. సూర్యాపేట మండలం తాళ్లఖమ్మంపహాడ్‌కు చెందిన సింగారపు శ్రీరాములు 2016 డిసెంబర్ 25న సూర్యాపేటకు వెళ్లేందుకు ఇందిరమ్మ కాలనీకి చెందిన గోపగాని లింగయ్య ఆటో ఎక్కాడు. ఈ క్రమంలో ఆటో ఎస్పీ కార్యాలయం వద్దకు రాగానే అదుపు తప్పి పల్టీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న శ్రీరాములు ఆటో కింద పడడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదేరోజు మృతి చెందాడు. మృతుడి కుమారుడు సైదులు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ జానకి రాములు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించగా.. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ శ్రీపాల్ రెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 2వేలు జరిమానా విధించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సహకరించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు


పోలీసులకు పట్టుబడ్డ యువకులు

బీబీనగర్ : మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. బొడుప్పల్‌కు చెందిన భూక్యా ఆజాద్‌నాయక్, హయత్‌నగర్ కుంట్లూరు పరిధిలోని రావినారాయణ కాలనీకి చెందిన వల్లెపు వంశీ, మేకల స్టాలిన్, బుడ్డ సునీల్ ఛత్తీస్‌ఘడ్‌లో గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారు. అందులో కొంత తాము సేవించేందుకు ఉంచుకొని మిగతా దానిని విక్రయించేందుకు కొండమడుగు మెట్టు వద్దకు ఆటోలో వచ్చారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న వారిని పట్టుకొని విచారించారు. తాము గంజాయి విక్రయించేందుకు వచ్చినట్లు వారు చెప్పడంతో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి 1.394 గ్రాముల గంజాయి, ఆటో, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. యువకులను పట్టుకున్న ఎస్ఐ రమేశ్, సిబ్బందిని సీఐ అభినందించారు.

గంజాయి కేసులో ఇద్దరు మైనర్లకు జరిమానా

రామగిరి(నల్లగొండ): గంజాయితో పట్టుబడిన ఇద్దరు మైనర్లకు జరిమానా విధిస్తూ నల్లగొండ జువైనల్ కోర్టు జడ్జి కె. శిరీష శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 ఫిబ్రవరిలో నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నట్లు నల్లగొండ వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందింది. అప్పటి సీఐ గోపి సంఘటన స్థలానికి వెళ్లారు. ఇద్దరు మైనర్ బాలురు ప్లాస్టిక్ కవర్‌లో గంజాయితో పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. కృష్ణయ్య వాదనలో ఏకీభవించిన జువైనల్ కోర్టు జడ్జి కె.శిరీష ఇద్దరు మైనర్లకు రూ.2 వేల జరిమానాతో పాటు 4 వారాల పాటు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తీర్పు వెల్లడించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

అడవిదేవులపల్లి : కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అడవిదేవులపల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బాపన్‌బాయి తండాకు చెందిన సపావత్ రజిత (32)కు నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామానికి చెందిన రమావత్ ఆంజనేయులుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. ఆంజనేయులు మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలను నడిపించేవాడు. వీరిద్దరూ గత కొంతకాలంగా తరుచూ గొడవపడుతున్నారు. గురువారం రాత్రి కూడా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అందరూ నిద్రిస్తున్న సమయంలో రాత్రి 10గంటల తరువాత రజిత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నిద్రమత్తులో నుంచి లేచిన ఆంజనేయులు భార్య ఉరివేసుకున్న విషయాన్ని గమనించి హుటాహుటిన మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతురాలి తండ్రి పరశురాములు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రజిత (ఫైల్)

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వెనుక వీధిలో ఉంటున్న సీహెచ్. అనసూయ (68) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ విషయమై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అనసూయకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్దకొడుకు వేణు నకిరేకల్లోని హోటల్లో పని చేస్తుండగా, చిన్న కొడుకు రాములు కాశీకి వెళ్లాడు. దాంతో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈ నెల 14వ తేదీ రాత్రి అనసూయ మృతి చెంది ఉండడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే వృద్ధురాలి మెడలో ఉన్న బంగారం గొలుసు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మోహన్‌బాబు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ చరమందరాజు దర్యాప్తు చేపట్టారు.

ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలో అధిష్టించి ఊంజల్ సేవోత్సవం చేపట్టారు.


అమ్మవారికి హారతినిస్తున్న అర్చకుడు

నృసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉత్సవమూర్తులకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. గులాబీ, చామంతి, బంతి, తులసీ దళంతో స్వామి, అమ్మవారికి పుష్పార్చన చేశారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. అంతకు ముందు తెల్లవారుజామున సుప్రభాత సేవ, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, సహస్రనామార్చన జరిపించారు.


లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు